www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 11 మార్చి 2024
5
వైఎస్ఆర్



సమస్యలు సంస్థ దృష్టికి తీసుకురావాలి : జడ్జి

కడప : ఏమైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ అన్నారు. ఆదివారం కడప నగరం బిలకల బావి వద్దగల జేమ్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి బాలల సంరక్షణ కొరకు స్నేహపూర్వక న్యాయ సేవల పథకం 2015 వివరించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, స్నేహపూర్వక సద్భావం, సోదర భావం, దేశభక్తి, లోకయుక్త, తప్పిపోయిన, గుర్తించబడని పిల్లలు, ప్రాథమిక హక్కులు, విధులు, భారతీయ శిక్షాస్మృతి, గృహ హింస చట్టం, పోక్సో చట్టం, ఆర్టికల్ 14 ఎ, మొదలగు అంశాలను వివరించారు. ఏదైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప వారి దృష్టికి తీసుకుని రావచ్చును అన్నారు. కార్యక్రమంలో మిస్టర్ సర్దార్ సాహిర్ రిజిస్ట్రర్ అబ్దుల్ హక్ యూనివర్శిటీ, మిస్టర్ ప్రసాద్ ఆర్టిఐ డిపార్ట్మెంట్ పాల్గొన్నారు.

'ఉక్కు' పనుల్లో కదలికేది?



2017లో

ప్రతిపక్ష నాయకుని హోదాలో చేపట్టిన పాదయాత్ర సందర్భంగా మూడేళ్లలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ శంకుస్థాపనకు పరిమితమైంది. దీంతోపాటు చెన్నూరులో సుగర్ పరిశ్రమ పునరుద్ధరణ, కడపలో స్ట్రోమ్‌వాటర్ డ్రైనేజ్‌లు, రాజోలి, జొలదరాశి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని ఇచ్చిన హామీలు అమలుకు ఆమడదూరంలో నిలవడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యమంత్రి హోదాలో అన్నమయ్య రిజర్వాయర్ పునరుద్ధరణ, జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనుల పునరుద్ధరణ, కొప్పర్తి పైప్‌లైన్, హజ్‌హౌస్ పెండింగ్ పనులు, ఒంటిమిట్ట చెరువులో జలావరణం విగ్రహం ఏర్పాటు వంటి పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండడం విస్మయాన్ని కలిగిస్తోంది. రాబోయే రెండు నెల్లో ముఖ్యమంత్రి టర్మ్ ముగియనున్న నేపథ్యంలో సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందుల పర్యటన నేపథ్యంలో కథనం...

- అటకెక్కిన చెన్నూరు చక్కెర పరిశ్రమ
- కదలని జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2
- అన్నమయ్య రిజర్వాయర్ పునరుద్ధరణేదీ
- గండికోట అదనపు పరిహారం చెల్లింపులేవీ
- నేడు పులివెందులకు సిఎం వైఎస్ జగన్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా ప్రగతి నత్తనడకన సాగుతోంది. కొప్పర్తి పారిశ్రామికవాడలో పరిశ్రమలు, గోపవరంలో సెంచరీప్లైవుడ్ పరిశ్రమలు, జిజిహెచ్ సూపర్ స్పెషాలిటీ మినహా మిగిలిన హామీలు అమలుకు నోచుకోలేదు. ముఖ్యంగా చెన్నూరు సుగర్ పరిశ్రమ పునరుద్ధరణ, జెఎస్‌డబ్ల్యూ కంపెనీ ఉక్కు పరిశ్రమ, జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనుల్లో ఆశించిన రీతిలో కదలిక కనిపించడం లేదు. చెన్నూరు సుగర్స్ కంపెనీ పునరుద్ధరణ సర్వే దశలోనే మునకలేస్తోంది. పునరుద్ధరణ పనులకు రూ.60 కోట్లను విడుదల చేయడంలో మీనమేషాలు లెక్కిస్తోంది. 2007లో కీ.శే, మాజీ ముఖ్యమంత్రి అప్పటి వైఎస్ సర్కారు తలపెట్టిన రూ.72 కోట్లతో కడపలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ కోల్డ్‌స్టోరేజీకి పరిమితమైంది. ఫలితంగా వర్షా కాలంలో కడప నగరంలోని లోతట్టు ప్రాంతాలు నీటిలో మునకలు వేస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.

అడ్డంకుల్లోనే ఆర్కిటెక్చర్ యూనివర్శిటీ

రూ.345 కోట్లతో కూడిన ఆర్కిటెక్చర్ యూనివర్శిటీ పనులకు మోక్షం లభించలేదు. ఐదేళ్లుగా స్థలం ఎంపిక, శంకుస్థాపన దశలోనే మగుతోంది. ఫలితంగా యూనివర్శిటీ భవన నిర్మాణం ఎప్పటికి సాకారమవుతుందో తెలియని దుస్థితి దాపురించింది. దీనికితోడు రూ.12 కోట్ల తో కూడిన హజ్‌హౌస్ పెండింగ్ పనులు ఎప్పటికి పూర్తవుతాయో తెలియడం లేదు. నిధుల లేమి కారణంగా సకాలంలో పూర్తి చేయడంపై సందేహం నెలకొంది.

కొప్పర్తి పైప్‌లైన్‌కు మోక్షమెప్పుడో?

రూ.150 కోట్ల విలువ కలిగిన కొప్పర్తి పారిశ్రామికవాడ నీటి సంఫరా పైప్‌లైన్ సాకారానికి నోచుకోవడం లేదు. నీటి కొరత, పర్యావరణ అనుమతుల కారణంగా పారిశ్రామిక పురోగతి కొరవడింది. ఇటీవల కొప్పర్తిలోని వైఎస్ఆర్ క్లస్టర్లలో ఏర్పాటు చేసిన పరిశ్రమలకు నీటి సదుపాయం అందడం లేదు. ఫలితంగా ఎప్పటికి పూర్తి స్థాయిలో కార్యకలాపాలు సాగిస్తాయో తెలియడం లేదు. కడప, ప్రొద్దుటూరు పాల పరిశ్రమల కార్యకలాపాలు ఆశించిన రీతిలో సాగడం లేదు. ప్రొద్దుటూరులో మూలన పడిన పాలపరిశ్రమ ఆస్తుల తనఖా పెట్టిన నేపథ్యంలో సుమారు రూ.90 కోట్లు చెల్లింపులకు నోచుకోకపోవడం లేదు. జగనన్న పాలవెల్లువ వంటి పథకంలో భాగంగా పునరుద్ధరణ కార్యకలాపాలను వేగవంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రూ.12 కోట్లతో కూడిన బుగ్గవంక బ్యూటిఫికేషన్, లైటింగ్ సిస్టమ్ ఎప్పుడు ఏర్పడతాయో తెలియని పరిస్థితి ఏర్పడింది.

కదలని జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2

జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనులకు కదలిక ఎప్పుడు వస్తుందో తెలియడం లేదు. ఫేజ్-1లో భాగమైన సర్వరాయసాగర్, వామి కొండ రిజర్వాయర్లు ఎప్పటికి సాకారమవుతాయో తెలియడం లేదు. ఇటీవల జిల్లా నీటి పారుదలశాఖ రూ.212 కోట్లతో కూడిన ప్రతిపాదనల అనుమతుల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. రూ.82 కోట్లతో కూడిన మైలవరం రిజర్వాయర్ ఆధునీకరణ ప్రతిపాదనలకు మోక్షం లభించడం లేదు.

నిరాశలోనే..నిర్వాసితులు

అన్నమయ్య, గండికోట నిర్వాసితుల కన్నీటి ధార ఆగడం లేదు. అన్నమయ్య రిజర్వాయర్ పునరుద్ధరణ రూ.777 కోట్లతో టెండర్లకు పరిమితమైంది. రెండేళ్ల కిందట అన్నమయ్య రిజర్వాయర్ గల్లంతైన ఘటనలో ఆరు గ్రామాలు తీవ్రంగా నష్టపోయిన సంగతి తెలిసిందే. ఐదు సెంట్లలో ఇళ్లు నిర్మించి ఇస్తామన్న హామీ అమలులో నిర్లక్ష్యం నెలకొంది. దీంతోపాటు గండికోట నిర్వాసితులకు అదనపు పరిహారం కింద రూ.3.25 లక్షలు ఇస్తామన్న హామీ కాగితాలకే పరిమితమైంది.

ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి- పులివెందుల టౌన్/ వేంపల్లె

ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి పర్యటనకు అధికారులు, పోలీసులు ఏర్పాట్లు పూర్తి చేశారు. రెండు రోజుల నుంచి కలెక్టర్ విజయరామరాజు, ఎస్‌పి సిద్ధార్థ కౌన్సిల్ పర్యవేక్షిస్తూ ఏర్పాటును పూర్తి చేశారు. సోమవారం ముఖ్యమంత్రి పలు కార్యక్రమాలను పాల్గొన సందర్భంగా సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం ఎస్‌పి పోలీసులకు దిశా నిర్దేశించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పులివెందుల పట్టణంలో దాదాపు 1462 మంది పోలీసులను నియమించారు.

నేడు ఇడుపులపాయలో వైఎస్ఆర్ పార్కు ప్రారంభం..

జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఇడుపులపాయకు విచ్చేస్తున్నారు. దీంతో అధికారులు ఇడుపులపాయలో ఏర్పాట్లును పూర్తి చేశారు. పులివెందులలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన అనంతరం ఇడుపులపాయలో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన వైఎస్ఆర్ మెమోరియల్ పార్కును సిఎం జగన్ మోహన్ రెడ్డి ప్రారంభించనున్నారు. 54 అడుగులతో పార్కులో ఏర్పాటు చేసిన వైఎస్ ఆర్ విగ్రహాన్ని కూడా ప్రారంభిస్తారు. వైఎస్ఆర్ ఘాట్ వద్దకు వచ్చే అభిమానులకు వైఎస్ఆర్ పార్కులో కుటుంబ సభ్యులతో కలసి ఆనందంగా గడపడానికి ఆహ్లాదకరమైన పచ్చని చెట్లతో పార్కును సుందరంగా చేశారు. పాడా నిధుల కింద 39.13 కోట్ల రూపాయలతో వైఎస్ఆర్ మెమోరియల్ పార్కును నిర్మించినట్లు ఇఇఈశ్వరయ్య తెలిపారు. అందులో 54 అడుగులతో వైఎస్ఆర్ విగ్రహం, 5.8 అడుగులతో వైఎస్ఆర్ ద్యానముద్ర విగ్రహం, 21 అడుగులతో పాదయాత్ర విగ్రహాలు, ఫొటో గ్యాలరీ బ్లాక్, రెస్టారెంట్ బ్లాక్, మూడు టాయిలెట్ బ్లాక్స్, ఆరు పార్కులు ఉన్నట్లు చెప్పారు. అందులో చిల్డ్రన్ పార్కు, డిపేక్షన్ పార్కు, ట్రోపికల్ గార్డెన్, పార్కింగ్ ఏరియా ఉన్నట్లు తెలిపారు. వాటర్ సప్లయ్ ఏర్పాటు చేసి మొత్తం గ్రీనరీ చేసినట్లు చెప్పారు.

'పది' ఫలితాలకు ప్రత్యేక ప్రణాళిక

- పంచతంత్ర వ్యూహంతో ఉత్తమ ఫలితాలు
- మోటివేషనల్ ప్రోగ్రామ్స్‌తో ఆత్మవిశ్వాసం ప్రోది
- జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి



ముఖా ముఖి..

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

పదవ తరగతి ఫలితాల సాధనకు ప్రత్యేక ప్రణాళికను అమలు చేస్తున్నాం. ఉత్తమ ఫలితాల సాధనకు పంచతంత్ర వ్యూహంతో సమ్మే టివ్, ఫార్మేటివ్ అసెస్మెంట్, మోటివేషనల్ ప్రోగ్రామ్స్ ప్రణాళికా బద్ధంగా అమలు చేశాం. మెటివేషనల్ ప్రోగ్రామ్స్‌తో టెన్త్ ఎగ్జామ్స్ పట్ల యువతలో నెలకొన్న భయాన్ని రూపుమాపే ప్రయత్నం చేయడమైంది. ఈ ఏడాది పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహణకు సంబంధించి పరీక్షా కేంద్రాల ఎంపిక మొదలుకుని ఇన్విజిలేటర్ల దగ్గర నుంచి సిట్టింగ్, ఫ్లైయింగ్ స్క్వాడ్స్ నియామకాల వరకు అన్ని ఏర్పాట్లనూ చేయడమైందని పేర్కొంటున్న జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డితో ముఖాముఖి...

పది ఫలితాల మెరుగుదలకు తీసుకున్న చర్యలేమిటి?

సకాలంలో సిలబస్‌ను పూర్తి చేయడం దగ్గర నుంచి సమ్మెటివ్, ఫార్మేటివ్, అసెస్మెంట్ పరీక్షలు నిర్వహణతోపాటు మోటి వేషనల్ ప్రోగ్రామ్స్ ద్వారా విద్యార్థుల్లో నెలకొన్న భయాన్ని పోగొట్టి వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే ప్రయత్నం చేశాం. దీనికితోడు 100 రోజుల పంచతంత్ర ప్రణాళిక అమలును క్లోజ్ మానిటరింగ్ చేయడం ద్వారా ఉత్తమ ఫలితాలు వస్తాయని ఆశాభావంతో ఉన్నాం.

పదవ తరగతి విద్యార్థులు వివరాలు తెలపండి?

జిల్లాలోని 581 ప్రభుత్వ, ప్రయివేటు, అన్‌ఎయిడెడ్ పాఠ శాలల నుంచి 27,858 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. వీరి లో 14,269 మంది బాలురు,13,589 మంది బాలికలు పరీక్షలకు హాజరవనున్నారు. గతేడాది కడప జిల్లా 73 శాతం ఫలితాలతో నాలుగో స్థానంలో నిలిచింది. ఈఏడాది డిఇఒతో కలిసి మెరుగైన ఫలితాల సాధించేలా కృషి చేశాం.

కెజిబివి విద్యార్థుల సంఖ్య ఎంత?

17 కెజిబివి పాఠశాలల తరుపున 614 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలకు హాజరవుతున్నారు. గతేడాది 72 శాతం ఫలితాలతో రాష్ట్రంలో ఆరవ స్థానంలో నిలిచాం. ఈఏడాది మొదటి మూడు స్థా నాల్లో నిలవాలనే లక్ష్యంగా పని చేశాం.

పరీక్షా కేంద్రాల వివరాలు తెలపండి?

జిల్లావ్యాప్తంగా 1503 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశాం. పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలనూ తీసుకోవడమైంది. ఈనెల 18 నుంచి పరీక్షలు నిర్వహించనున్నాం. ఈమేరకు కలెక్టర్ పర్యవేక్షణలో పలుమార్లు సంబంధిత శాఖల అధికారులతో సమావే శాలు నిర్వహించాం. కాపీయింగ్, మాస్‌కాపీయింగ్ మొదలుకుని ఎలాంటి లోపాలు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటాం.

సమస్యాత్మక కేంద్రాలెన్ని, వాటి నిర్వహణ చర్యలేమిటి?

జిల్లావ్యాప్తంగా ఆరు పరీక్షాకేంద్రాలను సమస్యాత్మకమైనవి. చక్రాయపేట కెజిబివి, ఖాజీపేట బాలికల జిల్లా పరిషత్ హైస్కూల్, కాశినాయనలోని ఎపి మోడల్ స్కూల్, నందిమండలం జిల్లా పరిషత్ హైస్కూల్, కలసపాడు జిల్లా పరిషత్ హైస్కూల్, కొండాపురం ఎపి ఎస్‌డబ్ల్యుఆర్ఎస్ ఉన్నాయి. వీటన్నింటిలో సిసి కెమెరాలను ఏర్పాటు చేయడమైంది.

గ్రామీణ విద్యార్థుల రాకపోకలకు తీసుకున్న చర్యలేమిటి?

గ్రామీణ విద్యార్థుల రాకపోకల సౌకర్యార్థం ఆర్టీసీ సౌకర్యం కల్పించాం. విద్యార్థులు హాల్ టికెట్ చూపించి బస్సుల్లో ఉచితంగా ప్రయాణించొచ్చు.

పరీక్షల పర్యవేక్షణకు స్క్వాడ్స్, మానిటరింగ్ సిబ్బంది వివరాలు తెలపండి?

జిల్లా వ్యాప్తంగా 153 పరీక్షా కేంద్రాల్లో 12,161 మంది ఉపాధ్యాయులు ఇన్విజిలేటర్లుగా బాధ్యతలు నిర్వహిస్తారు. వీరికి అదనంగా 153 మంది ఛీఫ్ సూపరింటెండెంట్లు, 153 మంది డిపార్టు మెంట్ ఆఫీసర్లను నియమించాం. సిట్టింగ్ స్క్వాడ్స్, ఫ్లైయింగ్ స్క్వా డ్స్ బృందాలు పరీక్షల అబ్జర్వర్లు పరీక్షలను తనికీ చేయడం జరుగు తుంది.

టెన్త్‌ప్రశ్నాపత్రాలు, సామగ్రి భద్రత గురించి తెలపండి?

టెన్త్ పరీక్షల సామగ్రిని, సెట్-1 ప్రశ్నాపత్రాలను ఆయా మండలాలకు చేరవేశాం. త్వరలోనే సెట్-2 ప్రశ్నాపత్రాలు కూడా వస్తాయి. పోలీస్‌స్టేషన్లలో పటిష్టభద్రత మధ్య భద్ర పరచడమైంది. పరీక్షా సమయానికి పరీక్షా కేంద్రాలకు తరలించేలా జాగ్రత్తలు తీసుకున్నాం.

కాంగ్రెస్ పార్టీలో చేరిన మైనార్టీలు

ప్రజాశక్తి - కడప



పార్టీలోకి ఆహ్వానిస్తున్న తులసిరెడ్డి

రాష్ట్రంలో మైనార్టీలందరూ కాంగ్రెస్ వైపు చూస్తున్నారని కాంగ్రెస్ పాలనలో మాత్రమే మైనారిటీలకు భద్రత, రక్షణ ఉంటాయని వారు నమ్ము తున్నారని పిసిసి మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. ఆదివారం కడప రవీంద్రనగర్‌లోని యు.ఐ. కళ్యాణమండపంలో దలాజక్ బద్రుద్దీన్ ఖాన్, పలువురు మైనార్టీలు తులసి రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పౌరసత్వ సవరణ చట్టం మొదలుకొని అనేక మైనార్టీ వ్యతిరేక నిర్ణయాలు తీసుకున్నదని, మైనార్టీలు అభద్రతాభావంలో ఉన్నారని అన్నారు. అటువంటి బిజెపి పొత్తు కోసం, ప్రాపకం కోసం రాష్ట్రానికి చెందిన ప్రాంతీయ పార్టీలు వైసిపి, టిడిపి, జనసేన ప్రాకులాడటం శోచనీయమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు విద్యా, ఉద్యోగాల్లో ముస్లిం మైనారిటీలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించాయని చెప్పారు. సమావేశంలో పిసిసి ఉపాధ్యక్షులు నజీర్ అహ్మద్, పిసిసి ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సత్తార్, సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు విష్ణు ప్రితమ్ రెడ్డి, సిటీ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు వేముల నాగరత్న, పిసిసి రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్, పిసిసి డెలిగేట్ పొట్టి పాటి చంద్రశేఖర్ రెడ్డి, మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు శ్యామలమ్మ, సంఘ సేవకులు సలావుద్దీన్, కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు చెప్పలి పుల్లయ్య, సమాచార హక్కు చట్టం రాష్ట్ర అధ్యక్షులు కోటపాటి లక్ష్మయ్య, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మామిళ్ళ బాబు, మామిళ్ళ నరసింహులు, ఆసిఫ్ అలీ ఖాన్, బాలం సుబ్బరాయుడు, బోరెడ్డి నరసింహారెడ్డి, వినయ్, అమర్, కోపూరి శ్రీనివాసులు, వెంకటేష్ పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

కడప అర్బన్ : విద్యతో వి ద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ అన్నారు. ఆదివారం రవీం ద్రన గర్‌లోని మదరస పైజె అబ్రార్ 20వ వార్షికోత్సవ సంభ బుఖారియా మసీదులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సయ్యద్ హమీద్, బషీర్ సోదరులు వేలామంది విద్యార్థులకు ఉచితంగా అరబిక్, ఉర్దూ భాషలలో విద్యా బోధన అందిస్తున్నారని అభినందించారు. మాజీ మంత్రి అహమ్మదుల్లా, మౌలానా కరీముల్లా మాట్లాడుతూ తల్లిదండ్రులు పాఠశాల విద్యతో పాటు తమ పిల్లలకు అరబిక్, ఉర్దూ భాషల్లో ప్రావీణ్యం సంపాదించే విధంగా శిక్షణ ఇవ్వాలని కోరారు. ప్రిన్సి పల్ ముఫ్తీ సయ్యద్ ఆసిం మాట్లాడుతూ విద్యార్థులు చదువుపట్ల ఏకాగ్రత వహించాలని చెప్పారు. మంచి అలవాట్లను పిల్లలకు తల్లిదండ్రులు నేర్పించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సయ్యద్ నజీర్ అహమ్మద్, కడప ఇస్లామిక్ సోసైటీ కార్యదర్శి బాబు బాయి, డైరెక్టర్లు సయ్యద్ హమీద్, బషీర్, అరబిక్ పండితులు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

కడప అర్బన్ : ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘ నాయకులు కోరారు. ఆదివారం ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘ నాయకులు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేయల శివార్జున అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. కరోనా పేరుతో డిఎలు ఇవ్వలేదని పేర్కొన్నారు. 3 డిఎలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వీటిని వెంటనే విడుదల చేయాలని చెప్పారు. మెరుగైన పిఆర్‌సి ఇస్తామని చెప్పి రివర్స్ పిఆర్‌సి ఇచ్చారన్నారు. ఉద్యోగులను అవమానించవద్దని, సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ పి.శేషగిరిరావు, జిల్లా అధ్యక్షులు సుదర్శన్‌బాబు, ప్రధాన కార్యదర్శి గంగరాజు, కార్యదర్శులు గంగాధర్, సురేంద్ర, జెవివి రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.వి.దేవదత్తం పాల్గొన్నారు.

బుగ్గవంక నిర్వాసితులకు మొండిచేయి

కడప అర్బన్ : నగరంలో బుగ్గవంక పరివాహక ప్రాంతాల్లో నివసించే నిరుపేద మైనార్టీ కుటుంబాలకు ఆశ్రయం కల్పించుటలో వైసిపి ప్రభుత్వం పూర్తి వైఫల్యం చెందిందని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి, కడప అభ్యర్థి మాధవి రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు అన్నారు. ఆదివారం బాలదాసు స్వగృహంలో అల్పాహార విందుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రౌడీ రాజ్యం, దోపిడీ పాలనకు చరమగీతం పాడాలని పిలుపు నిచ్చారు. టిడిపి గెలిపిస్తే నగరాన్ని అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు హరిప్రసాద్, పీరయ్య, మల్లికార్జున, శంకర్, మాసాపేట శివ, స్వామినాథం, సుధాకరరెడ్డి, శివారెడ్డి, తిరుమలేష్, శ్రీనివాసులు, ప్రసాద్, దస్తగిరి, నజీర్ పాల్గొన్నారు.



మృతిచెందిన షేక్ ఇమాంబీ, ఫకీరా మస్తాన్

కుందూలో నీట మునిగి ఇద్దరు మృతి

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

నియోజకవర్గంలోని రాజుపాలెం మండలం పరిధిలో ఉన్న కుందూ నదిలో నీట మునిగి ఇద్దరు మృతిచెందారు. వివరాలు.. నంద్యాల జిల్లా చాగలమర్రి పట్టణానికి చెందిన షేక్ ఖాజాహుస్సేన్, అతని భార్య షేక్ ఇమాంబీ (27), బావమరిది ఫకీరా మస్తాన్ (26) అదే మండలంలోని ఎర్రగుంట్ల వద్దనున్న దర్గాకు పయనమయ్యారు. ఇమాంబీకి ఆరోగ్యం సరిగ్గా లేనందున దర్గా వద్ద పూజ కోసం వెళ్లారు. తిరిగి చాగలమర్రికి వెళ్తూ వైఎస్ఆర్ జిల్లా రాజుపాలెం మండల పరిధిలోని కులూరు గ్రామం కుందూ నదిలో స్నానం చేయడానికి దిగారు. వారిలో హుస్సేన్ కట్టపైనే ఉన్నారు. నదిలోదిగిన ఇమాంబీ, ఫకీరా మస్తాన్ ప్రమాద వశాత్తు నీట మునిగారు. సమీపంలోని రజకులు గుర్తించి నీట మునిగిన ఇద్దరిని వెలికి తీశారు. అప్పటికే వారు ఊపిరి ఆడక మృతిచెందారు. ఖాజాహుస్సేన్ ఫిర్యాదు మేరకు ఎఎస్ఐ సిద్దయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విమానయాన సేవలు విస్తృతం

ప్రజాశక్తి - కడప

కడప జిల్లాలో ఎయిర్ పోర్ట్ నూతన టెర్మినల్ బిల్డింగ్ ఏర్పాటుతో విమానయాన సేవల విస్తృతంతో పాటు జిల్లాలో అన్ని రకాల రవాణా వ్యవస్థలు మెరుగు పడనున్నాయని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా పేర్కొన్నారు. భారతీయ విమానాశ్రయాల ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో రూ.226 కోట్ల నిధులతో కడప విమానాశ్రయ నూతన టెర్మినల్ బిల్డింగ్ నిర్మాణ పనులకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదివారం ఉత్తర్ ప్రదేశ్ అజాంఘర్ నుంచి వర్చువల్ విధానం శంకుస్థాపన చేశారు. కార్యక్రమానికి స్థానిక ఎయిర్ పోర్ట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభా నుంచి డిప్యూటీ సిఎంతోపాటు కలెక్టర్ విజయ్ రామరాజు, కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు సి.ఎం. రమేష్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మాట్లాడుతూ ప్రధాని శిలాఫలకాన్ని ఆవిష్కరించడం జిల్లాకు గర్వకారణంగా చెప్పవచ్చున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ కడప విమానాశ్రయం నుండి 2022-23 సంవత్సరంలో దాదాపు 70 వేల మంది ప్రయాణికులు విమానయాన సేవలను సద్విని యోగించుకున్నారు. కడప ఎంపీ మాట్లాడుతూ ఫారెస్ట్ ఏరియాలో అతి సమీపంలో అటవీ ప్రాంతం ఉండడంతో అటవీశాఖ అనుమతులు, స్థానిక భూ యజమానులను ఒప్పించి నూతన టెర్మినల్ భవన నిర్మాణం కోసం అనుమతులు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో కడప ఆర్‌డిఒ మధుసూదన్, రీజనల్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ ఎస్.జె. ఫణికర్, కడప ఎయిర్ పోర్ట్ డైరెక్టర్ సుజిత్ కుమార్ పాల్గొన్నారు.

'పుత్తా' గెలుపు అభివృద్ధికి మలుపు

చెన్నూరు : కమలాపురం నియోజకవర్గంలోని 6 మండలాలలో పుత్తా గాలి వీస్తోందని, మహిళలు, యువత, రైతులు ఆయన స్వచ్ఛందంగా నడుస్తున్నారని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్సూర్ అక్బర్ తెలిపారు. ఈ సందర్భంగా మన్సూర్ అక్బర్ స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పుత్తా నరసింహారెడ్డి భవిష్యత్‌కు గ్యారంటీ పేరుతో నియోజకర్గంలోని ప్రతి ఇంటికి వెళ్లి కార్యక్రమాలు వివరించి ప్రజా అభిమానం సాధించారని చెప్పారు. 2014 నుంచి 2019 మధ్య టిడిపి ప్రభుత్వంలో నియోజకవర్గంలోని అన్ని గ్రామ ప్రజలకు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అందజేశారన్నారు. ఆయన ఎమ్మెల్యే అయితే కమలాపురం నియోజవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతారని చెప్పారు. సమావేశంలో పట్టణ అధ్యక్షులు ఆకుల చలపతి, కుందేటి కృష్ణయ్య యాదవ్, మంజూరు అహమ్మద్,మాబు, సుబ్బారెడ్డి, గౌస్ పాల్గొన్నారు.

భవానీ నగర్‌లో చలివేంద్రం ప్రారంభం

చెన్నూరు : 'గ్రామీణ మహిళా శక్తి ఫౌండేషన్' ఆధ్వర్యంలో మండల కేంద్రమైన చెన్నూరు, భవానీ నగర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం కడప ఫైర్ స్టేషన్ కానిస్టేబుల్ నూర్‌బాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేసవి తాపం ఇప్పటికే మొదలయినందున ఇలాంటి చలివేంద్రాల ఏర్పాటుకు దాతలు ముందుకు వచ్చి స్థానికంగా సమాజసేవ చేయాలన్నారు. మంచినీటి సౌకర్యంతో పాటు ప్రతివారం మజ్జిగ అందివ్వడం చాలా మంచిదన్నారు. ప్రస్తుతం ముదురుతున్న ఎండలు దృష్టిలో పెట్టుకొని స్వచ్ఛంద సేవా సంస్థలు చలివేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు బల్లెం శ్రీవెంకట్, చైర్మన్ యాగల శ్రీనివాసులు, చిన్నపురెడ్డి సీనియర్ పాత్రికేయులు గోపాలకృష్ణ. స్థానికులు పాల్గొన్నారు.

దూదేకులకు మరిన్ని సదుపాయాలు

- కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి

ప్రజాశక్తి - కడప సిటీ



వైసిపిలో చేరిన దూదేకులు

ముస్లిమ్ దూదేకులకు మరిన్ని సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ఎస్ఎల్‌వి కల్యాణ మండపంలో ముస్లిమ్ నూర్‌బాష్-దూదేకుల ఆత్మీయ సమా వేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపికి ముస్లి ములతో విడదీయరాని అనుబంధం నెలకొందన్నారు. వైసిపి ఆవిర్భావం నుంచి నేటి వరకు ముస్లిముల ఆదరాభిమానాలతో అనుబంధం మరింత బలోపేతం అవుతోందని కొనియాడారు. ప్రతిపక్ష నాయకులు చంద్రబాబు బిజెపితో దాసోహమై ముస్లిముల మనోభావాలతో ఆడుకోవడం దారుణ మన్నారు. తెలుగుజాతి ఆత్మగౌరవం నినాదంతో ఏర్పడిన టిడిపి తెలుగుజాతి ఆత్మ గౌరవాన్ని తాకట్టుపెట్టే దుస్థితికి జారుకుందని ఎద్దేవా చేశారు. కీ.శే వైఎస్ఆర్ హయాం నాటి ముస్లిములకు నాలుగు శాతం రిజర్వేషన్ సదు పాయాన్ని రద్దు చేస్తామన్న అమిత్‌షాతో చెట్టాపట్టా లేసుకోవడా న్ని గమని ంచాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయంతో చదవిన నంద్యాలకు చెందిన మైనార్టీ విద్యార్థి బహుళజాతి కంపెనీలో గుర్తింపు పొందిన ఉద్యోగాన్ని సాధించారన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల టికెట్ల కేటాయింపుల్లో వైసిపి తొమ్మిది విడతలుగా కేటాయించిన 64 టికెట్లలో ఏడు సీట్లు మైనార్టీలకు ఇచ్చామని చెప్పారు. వైసిపిలో చేరబోయే నాయకులకు సముచిత ప్రాధాన్యత కల్పిస్తామని తెలిపారు. అంతకు ముందు మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సుభాన్‌బాషా మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ముస్లిముల మనోభావాలను తాకట్టు పెట్టడానికి ఢిల్లీలో మంతనాలు సాగిస్తు న్నాడని విమర్శించారు. ఇటువంటి నాయకులను నమ్మి ఓట్లేస్తే ముస్లిముల ప్రయోజనాలు దెబ్బతింటాయని గుర్తు చేశారు. టిడిపి హయాంలో మైనారీ శాఖా మంత్రి పోస్టుకు మైనార్టీలే లేకుండా పోయారా అని ప్రశ్నించారు. వైసిపి హయాంలో మైనార్టీ ఎమ్మెల్యేకు రెండు దఫాలుగా డిప్యూటీ సిఎం పదవి తోపాటు మైనార్టీశాఖా మంత్రి పదవిని కట్టబెట్టిన ఘనత వైఎస్ జగన్‌కే చెందుతుందని కొనియాడారు. ఇటు వంటి ముఖ్యమంత్రిని గెలిపించుకోవాల్సిన బాధ్యత ముస్లిములపై ఉందని గుర్తు చేశారు. టిడిపి నుంచి వైసిపిలో చేరిన సయ్యద్‌జిలానీ మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకులు చంద్రబాబు ముస్లి ముల మనోభావాలను తాకట్టు పెట్టడాన్ని జీర్ణించుకోలేక వైసిపిలో చేరుతున్నానని చెప్పారు. మైనార్టీల పట్ల అపారమైన ప్రేమను కనబ రుస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను గెలిపించుకోవడానికి సిద్ధమని ప్రకటించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానం దరెడ్డి, వైస్ ఎంపిపి సుధాకర్‌రెడ్డి, మాజీఎంపిపి కళాయాదవ్, మోది న్, చింత కొమ్మదిన్నె మండల వైసిపి కన్వీనర్, అధ్యక్షులు, ఇతర నాయకులు, వందలాది మంది మైనార్టీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆధునిక విద్యాబోధన

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యార్థులకు మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా ఆధునిక విద్యాబోధన కొనసాగుతూ ఉందని డిప్యూటీ సిఎం అంజాద్‌బాష అన్నారు. ఆదివారం 'అపుస్మా' ఆధ్వర్యంలో మేడా కన్వెషన్ సెంటర్‌లో ప్రభుత్వ, ప్రయివేట్ ఉపాధ్యాయులకు విద్యా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో సమూలమైన మార్పు తీసుకు వచ్చామని పేర్కొన్నారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు మెరుగపడ్డాయని చెప్పారు. పేద విద్యార్థులకు ఉన్నత చదువులు అందిస్తున్నామని తెలిపారు. త్వరలో ఇంటర్నేషనల్ సిలబస్ తీసుకు వస్తామన్నారు. ఎంపీ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ ఐదేళ్ల వైసిపి పాలనలో విద్యలో సంస్కరణలు తీసుకువచ్చామని చెప్పారు. మధ్యాహ్న భోజన మెనులో పెనుమార్పు చేశామని తెలిపారు. 1998 డిఎస్‌సి అభ్యర్థులు 5వేల మంది ఉంటే 4వేల మందికి ఉద్యోగాలు ఇచ్చామన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యుల్ చేశామని పేర్కొన్నారు. కోవిడ్ వల్ల బకాయిపడ్డ మొత్తాలను ఉపాధ్యాయులు, ఉద్యోగులకు త్వరలో చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎం.వి.రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రయివేట్, ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. సదస్సులో జెఎసి రాష్ట్ర అధ్యక్షులు ఎం.కృష్ణయ్య, కార్యదర్శి అశోక్‌కుమార్‌రెడ్డి, అపుస్మా జిల్లా అధ్యక్షులు గంగయ్య, నాయకులు బండి విశ్వనాథరెడ్డి, ఎస్.వి.రమణారెడ్డి, ఎస్.అమరనాథ్‌రెడ్డి, నాగేశ్వరరావు, రామంజులు, సి.కె.వెంకటరమణారెడ్డి, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

'బత్యాల'కు టికెట్ ఇవ్వాలి

ప్రజాశక్తి - కడప అర్బన్



మాట్లాడుతున్న చెన్నంశెట్టి మురళి

వైసిపి బలిజలను పూర్తిగా విస్మరించిందని, అందుకే బలిజలు టిడిపి వైపు చూస్తున్నారని, ఇటువంటి తరుణలో బిజెపి పొత్తు పేరుతో బలిజలకు అన్యాయం చేస్తే సహించమని, బత్యాల చంగలరాయుడుకు టిక్కెట్ ఇవ్వాలని గ్రేటర్ బలిజ సంఘం అధ్యక్షులు చెన్నంశెట్టి మురళి కోరారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడపలో మాధవిరెడ్డిని అధిక మెజారిటీతో గెలిపించుకుంటామని పేర్కొన్నారు. బలిజలకు డిప్యూటి సిఎం అంజాద్‌బాష ఏమిచేయలేదని విమర్శించారు. బలిజ భవన్‌ను విస్మరించారని చెప్పారు. శ్రీకృష్ణదేవరాయులు విగ్రహానికి పూలదండ వేసిన దాఖలాలు లేవని తెలిపారు. టిడిపి అధికారంలోకి వస్తే బలిజ భవన్ కట్టిస్తామని మాధవిరెడ్డి హామీ ఇచ్చారని పేర్కొన్నారు. సమావేశంలో బలిజ నాయకులు మాలే శివ, రమణ, సుబ్రమణ్యం, రెడ్డెయ్య, వెంకటసుబ్బయ్య, మహేష్, నరసింహులు, సాంబయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

వేంపల్లెలో వైఎస్‌ఆర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఏర్పాటు చేసిన వైఎస్‌ఆర్ విగ్రహాన్ని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆవిష్కరించారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా వేంపల్లెలోని నాలుగు రోడ్ల కూడలిలో వైఎస్‌ఆర్ విగ్రహాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. ఈనేపథ్యంలో ఆదివారం సాయంత్రం ఎంపీ విగ్రహాన్ని ఆవిష్కరించి వైఎస్‌ఆర్ సర్కిల్‌గా నామకరణం చేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ వైఎస్‌ఆర్ సిఎంగా ఉన్నప్పుడు వేంపల్లె మండలంలో పలు అభివృద్ధి పనులు చేయడంతోపాటు పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. ప్రస్తుత సిఎం జగన్ మండలాన్ని కోట్లాది రూపాయలతో రూపురేఖలు మార్చినట్లు చెప్పారు. నాలుగు రోడ్ల కూడలిలో వైఎస్‌ఆర్ విగ్రహావిష్కరణ చేయడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. చంద్రబాబు ఎన్ని జెండాలతో కలిసి వచ్చినా రాబోయేది జగనన్న ప్రభుత్వమే అన్నారు. రాష్ట్రానికి, ఈ ప్రాంతానికి రాజశేఖర్‌రెడ్డి ఎంతో మేలు చేశారని తెలిపారు. వైసిపి నేత సతీష్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్టీఆర్, రాజశేఖర్‌రెడ్డి చేసిన మేలును ఎవరూ మర్చిపోరని పేర్కొన్నారు. పులివెందుల నియోజకవర్గంలోని ఏడు మండలాలను సస్యశ్యామలం చేపట్టేందుకు కృష్ణా జలాలు తెప్పించారన్నారని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డి, సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు, ఎంపిపి లక్ష్మి గాయత్రి, సివిల్ సప్లయ్ డైరెక్టర్ షబ్బీర్ వలి, కాణిపాకం దేవస్థానం డైరెక్టర్ కొండయ్య, హజ్‌హౌస్ డైరెక్టర్ మునీర్, షాదీఖానా కమిటీ అధ్యక్షుడు బిఎస్ షెక్షావలి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తండ్రి ఆశయాలను అమలు చేస్తున్న జగన్

ప్రజాశక్తి - సింహాద్రిపురం

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా ప్రస్తుత సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అభివృద్ధి పనులు చేస్తున్నారని కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని బిదినంచెర్లలో ఎంపీ దివంగత సిఎం వైఎస్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ అన్ని వర్గాల ప్రజలలో చెరగని ముద్ర వేసుకున్నారని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి ఝాన్సీరాణి, మండల కన్వీనర్ దేవిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, వైసిపి నాయకుడు బిఎన్ బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.



సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

హామీ మేరకు రోడ్ల నిర్మాణాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మైదుకూరు

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని లింగలదిన్నె, కోనాయిపల్లి గ్రామంలో రూ.25 లక్షలతో సిసి రోడ్ నిర్మాణానికి ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అన్ని గ్రామాల్లో రోడ్లు నిర్మించడం జరిగిందన్నారు. లింగలదిన్నె, కోనాయపల్లి గ్రామాల్లో కూడా ఇచ్చిన హామీ మేరకు సిసి రోడ్డు నిర్మాణం చేపట్టనున్నామన్నారు. ఈ పనులను వెంటనే చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గతంలో ఏ ప్రభుత్వం చేపట్టని పనులను సిఎం జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టారన్నారు. రాబోయే ఎన్నికల్లో జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, వక్ఫ్ బోర్డు చైర్మన్ మసీనా దస్తగిరి, మైదుకూరు, చాపాడు మండల పరిధిలోని ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అల్లాడుపల్లెలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - చాపాడు

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవస్థానం ఆవరణలో పది రోజులుగా నిర్వహించిన బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. పది రోజులుగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రతిరోజూ ఒక ప్రత్యేక వాహనంపై ఊరేగింపు నిర్వహించారు. ముగింపు సందర్భంగా ఆదివారం అశ్వ వాహనంపై స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. మహాశివరాత్రి సందర్భంగా భద్రకాళి సమేత వీరభద్ర స్వామి కల్యాణం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆదివారం మాఘ అమావాస్య పూజలతో బ్రహ్మోత్సవాలు ముగించారు. ఈ సందర్భంగా మహాశివరాత్రి రోజున స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ఆలయ చైర్మన్ జివి వెంకటసుబ్బారెడ్డి, ఇఒ శ్రీనివాసులు, సర్పంచ్ జిఎం కిషోర్‌కుమార్ రెడ్డి, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా సేవా టికెట్ల ద్వారా రూ.1.42 లక్షలు, తాత్కాలిక హుండీ ద్వారా రూ.2.38 లక్షలు, లడ్డు ప్రసాదం ద్వారా రూ.1.16 లక్షలు, తాత్కాలిక అంగళ్ల ద్వారా రూ.50 వేలతో మొత్తం రూ.5.47 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఆలయ చైర్మన్ జివి వెంకటసుబ్బారెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శ్రీనివాసులు తెలిపారు. శివరాత్రి ఉత్సవాలను జయప్రదం చేసిన అధికారులకు, కమిటీ సభ్యులకు, పోలీస్ సిబ్బందికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

పారిశుధ్యం అధ్వానం.. రోడ్లపై నిలుస్తున్న మురుగునీరు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని పలు గ్రామాల్లో పారిశుధ్యం చాలా అధ్వానంగా ఉంది. సిమెంటు రోడ్లు ఏర్పాటు చేసినప్పటికీ మురుగు కాలువలు లేకపోవడంతో చేతి పంపులు, కుళాయిల నుంచి వచ్చే వ్యర్థ నీరు రోడ్ల పైనే నిల్వ ఉంటూ రోగాలకు నిలయాలుగా మారుతున్నాయి. పంచాయతీ అధికారులు వాటిని చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక పారిశుధ్య నిధులు మంజూరైనప్పటికీ వాటిని వినియోగించడంలో వెనుకబడుతున్నారు. రోడ్లపై నిలువ ఉంటున్న మురికి నీరు పాచి పట్టి దోమలకు నిలయాలుగా మారుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుధ్య పనులను చేపడితే ఉపయోగకరంగా ఉంటుంది. లేదంటే ప్రజలు జ్వరాల బారిన పడే అవకాశం, ఆరోగ్యపరంగా ఇబ్బందులు పడే అవకాశం ఉంటుంది. మండల పరిధిలోని రేపల్లె, రాజుపాలెం పేట, ఖాదరపల్లె, విశ్వనాథపురం, బద్రిపల్లె, చిన్నగురువలూరు, నెర్రవాడ, గుంత చియ్యపాడు గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉంది.



గుంత చియ్యపాడులో అధ్వానంగా ఉన్న పారిశుధ్యం

నత్తనడకన వాటర్ గ్రిడ్ నిర్మాణ పనులు

రూ.460 కోట్లతో ప్రతి ఇంటికీ తాగునీరు అందించేలా ప్రణాళికలు



పార్నపల్లె సమీపంలో సురక్షిత నీటిగా మార్చేందుకు ఏర్పాటు చేస్తున్న ఫిల్టర్

ప్రజాశక్తి - సింహాద్రిపురం

పులివెందుల నియోజవర్గంలోని ప్రతి గ్రామంలో.. ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీటిని అందించేందుకు చేపట్టిన వాటర్ గ్రిడ్ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ పనులు గత ఏడాది మే నెలకు పూర్తి చేయాల్సి ఉంది. కొన్ని అనివార్య కారణాల వల్ల పనులు సాగలేదని డిసెంబర్‌కు పూర్తి చేస్తామని సంబంధిత కాంట్రాక్టర్ ఒప్పంద గడువును పొడిగించుకున్నారు. డిసెంబర్ చివరికి కూడా పనులు పూర్తి కాకపోవడంతో మరోమారు మే నెల చివరి నాటికి పూర్తి చేస్తామని గడువు పొడిగించుకున్నారు. నియోజకవర్గంలోని పులివెందుల రూరల్, మున్సిపాలిటీ, సింహాద్రిపురం, లింగాల, వేముల, వేంపల్లి, తొండూరు, చక్రాయపేట మండలాల పరిధిలోని 299 గ్రామాలతోపాటు పులి వెందులలోని జేఎన్టీయూ, మెడికల్, వెటర్నరీ, హార్టికల్చర్, అగ్రికల్చర్, ఆంధ్ర ప్రదేశ్ అత్యున్నత స్థాయి పసుపు పరిశోధన కేంద్రం, వేంపల్లి సమీపంలోని ట్రిబుల్‌ఐటికి తాగునీరు అందించేందుకు రూ.460 కోట్లతో పనులు చేపట్టారు. లింగాల మండలంలోని పార్నపల్లి సమీపంలోని చిత్రావతి రిజర్వాయర్ నుంచి నీటిని ఫిల్టర్ చేసి స్వచ్ఛత నీటిని ప్రజలకు అందించనున్నారు. ఇందుకోసం 227 ట్యాంకులు, 1130 కిలోమీటర్ల మేర హెచ్‌డిపి పైపులైను, 280 కిలోమీటర్ల మేర డిఐ పైపులైను నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే ట్యాంకులలో నిర్మాణాలు 80 శాతం దాకా పూర్తయ్యాయి. పైపులైను నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ నిర్మాణ పనులు పూర్తయితే మున్సిపాలిటీ పరిధిలో 11.6(ఎంఎల్‌డి) మిలియన్ వాటర్ డే, గ్రామీణ ప్రాంతాలలో 65 ఎంఎల్‌డిల నీటిని ప్రజలకు అందించనున్నారు.

మే చివరికి పనులు పూర్తి చేస్తాం..

ఈ ఏడాది మే నెల చివరి నాటికి వాటర్ గ్రిడ్ నిర్మాణ పనులు పూర్తి అయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేశాం. ఆ మేరకు సంబంధిత కాంట్రాక్టర్‌తో తరచూ చర్చిస్తూ పనులు వేగవంతానికి చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి ఒక్కరికి సురక్షిత నీటిని అందించాలనే లక్ష్యంతో ఉన్నాం.

- విజయ్ భాస్కర్, ఇఇ, ఆర్‌డబ్ల్యుఎస్, పులివెందుల



వాటర్ గ్రిడ్ నీటి సరఫరా కోసం సిద్ధంగా ఉన్న పైపులు

పేదల చూపు కాంగ్రెస్ వైపు : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రంలోని పేదలందరూ కాంగ్రెస్ వైపు చూస్తున్నట్లు పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే తమ జీవితాలు బాగు పడతాయని పేద ప్రజలు అనుకుంటున్నట్లు చెప్పారు. కాంగ్రెసు పార్టీ అధికారంలోకి వస్తే ఇందిరమ్మ అభయం పథకాన్ని అమలు చేస్తామన్నారు. ఈ పథకం ద్వారా ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రతి నెల రూ.5 వేలు ఆర్థిక సహాయం అందుతుందన్నారు. ఏ పేద కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురి కాకుండా ఉండేందుకు ఈ పథకాన్ని ప్రకటించడం జరిగిందని తెలిపారు. వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాల డబ్బులు కలిపినా ఇందిరమ్మ అభయ పథకాన్ని సాటి రావన్నారు. టిడిపి ప్రకటించిన సూపర్ 6 పథకాలు కూడా కాంగ్రెస్ ప్రకటించిన అభయ పథకం ముందు బలాదూర్ అన్నారు. ఇందిరమ్మ అభయం పేదలకు వరం లాంటిదని చెప్పారు. ఈ పథకం అమలు కావాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని తులసిరెడ్డి తెలిపారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు.

వర్షాభావంతో తగ్గిన నూగు సాగు



సిద్ధారెడ్డిపల్లె వద్ద సాగులో ఉన్న నూగు పంట

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలో రబిలో వేసవి పంటగా సాగు చేసే నూగు పంట ఈ ఏడాది గణనీయంగా తగ్గింది. జనవరి రెండవ వారం నుంచి ఫిబ్రవరి వరకు రైతులు పంటను సాగు చేపట్టేవారు. ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులతో పంట సాగు పూర్తిగా తగ్గింది. సాగు చేసిన పంట ప్రస్తుతం నెల పంట దశలో ఉంది. గతంలో మండల పరిధిలోని సిద్ధారెడ్డిపల్లి, సోమాపురం, విశ్వనాథపురం, బద్రిపల్లి, చియ్యపాడు, సీతారామపురం, అల్లాడుపల్లె, వెంగన్నగారిపల్లె, చెండ్లూరు, రేపల్లె గ్రామాల పరిధిలో 500 ఎకరాలలో రైతులు పంటను సాగు చేసేవారు. ఈ ఏడాది గతంలో కంటే సాగు తగ్గిందని తెలుస్తోంది. కుందూ నదికి కూడా నీరు పూర్తిగా తగ్గింది. సాగు చేసిన పంట ఏప్రిల్‌లో ఎక్కువ భాగం నూర్పిడికి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. గతంలో కేసీ కెనాల్‌కు మార్చి చివరి వరకు నీరు వస్తే నూగు పంట పండేదని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం రిజర్వాయర్లలో నీరు లేకపోవడంతో పరిస్థితి అధ్వానంగా ఉంది. వేడి తీవ్రతకు పంటకు నీరు ఎక్కువగా అవసరం అవుతుందని రైతులు పేర్కొంటున్నారు. నూగు పంట సాగుకు ఎకరాకు రూ.పదివేలలోపు మాత్రమే ఖర్చు అవుతాయని నాలుగు నుంచి ఐదు బస్తాల వరకు దిగుబడి వస్తే వేసవిలో ఖర్చులు మిగులుతాయని రైతులు అంటున్నారు. కేసీ కెనాల్ పరిధిలో రైతులు మాత్రం ఒక తడి నీరు విడుదల చేయాలని కోరుతున్నారు.

ఏ ప్రయోజనాన్ని ఆశించి బిజెపితో పొత్తు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

గతంలో ధర్మపోరాటదీక్ష పేరుతో రాష్ట్రమంతా ఊరూరా తిరిగి బిజెపిని, మోడీని దుమ్మెత్తిపోసిన చంద్రబాబు నేడు ఏ ప్రయోజనాన్ని ఆశించి బిజెపితో పొత్తుపెట్టుకున్నారో తన నియోజకవర్గ ప్రజలతోపాటు రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం 23వ వార్డులో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ.. విస్తృత ప్రయోజనాలను ఆశించి బిజెపితో పొత్తు పెట్టుకున్నట్లు చంద్రబాబు చెప్పారని, ఆ విస్తృత ప్రయోజనాలలో కొన్నైనా ప్రజలకు వివరించాలన్నారు. విభజిత రాష్ట్రానికి ప్రత్యేకహోదా కోసమా, ప్రత్యేక ప్యాకేజి కోసమా, వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రకు నిధుల కోసమా ఎందుకోసం బిజెపితో పొత్తుపెట్టుకున్నారో చెప్పాలన్నారు. పొత్తుకోసం చంద్రబాబు వెంపర్లాడి శివరాత్రి జాగారం చేసి పొత్తు కుదుర్చుకున్నట్లు తెలిపారు. గతంలో మోడీని విమర్శించి నేడు పొత్తు అనడం రెండునాలుకల ధోరణికి నిదర్శనమన్నారు. రాష్ట్రాన్ని రెండు ముక్కలు చేసింది.. వెనుకబాటుతనాన్ని అప్పగించింది కాంగ్రెస్, బిజెపి పార్టీలే అన్నారు. స్వార్థపూరిత రాజకీయాల కోసం తన అవినీతి ఆరోపణల నుండి బయట పడేందుకు మాత్రమే చంద్రబాబు పొత్తు నాటకానికి తెరలేపి రాష్ట్ర ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. కుటుంబ వ్యవస్థ గురించి ఏమాత్రం తెలియని ప్రధాని మోడీతో పెట్టుకొని ప్రభంజనం సృష్టిస్తానని బీరాలు పలకడాన్ని ప్రజలు గమనిస్తున్నారని రాచమల్లు అన్నారు.



ఎమ్మెల్యే దంపతులకు స్వాగతం పలుకుతున్న 23వ వార్డు ప్రజలు

300 కుటుంబాలు వైకాపాలో చేరిక : ప్రొద్దుటూరు మండలం అమృత్‌నగర్-2కు చెందిన 300 కుటుంబాలు స్థానిక వైసిపి నాయకులు బాబావలి ఆధ్వర్యంలో ఆదివారం వైసిపిలో చేరాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ జనరంజక పాలన వల్ల ప్రజలు ఆకర్షితులవుతున్నారన్నారు. ప్రతిఇంటా సంక్షేమం అందిందన్నారు. అమృత్‌నగర్‌లో కాలువలు, రోడ్లు తన హయాంలో నిర్మాణాలను పూర్తి చేసుకున్నాయన్నారు. తాగునీటి ఎద్దడిని పరిష్కరించే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



పార్టీలో చేరినవారితో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలోని చిలంకూరు, రంగసాయపురం, కర్చుకుంటపల్లి, చిత్రాజుపల్లి, సున్నపు రాళ్లపల్లి, ముద్దనూరు మండలంలోని పెనికలపాడు, కొత్తపల్లి గ్రామాలకు చెందిన పలువురు నాయకులు కార్యకర్తలు వైసిపిలో చేరారు. ఆదివారం చిలంకూరులోని ఎంబిఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి సమక్షంలో పలువురు వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. నగర పంచాయతీ పరిధిలోని సుందరయ్య నగర్, ఇందిరా నగర్‌లో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసిపిలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి అందరిని సాదరంగా ఆహ్వానించారు. అందరికీ తగిన గుర్తింపు, న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

మహిళా విద్యకు ఆద్యురాలు సావిత్రి బాయి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

మహిళా విద్యకు ఆద్యురాలు సావిత్రిబాయి అని, తాను చదవడమే కాకుండా తొలి మహిళా ఉపాధ్యాయురాలుగా అనేకమంది మహిళలను విద్యావంతులుగా చేసిన ఘనత సావిత్రిబాయిదే అని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ హేమాంజలి పేర్కొన్నారు. జనవిజ్ఞానవేదిక (జెవివి) ఆధ్వర్యంలో మహిళాదినోత్సవం, సావిత్రిబాయి వర్ధంతి సందర్భంగా ఆదివారం 'నేను.. సావిత్రిబాయిని' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హేమాంజలి మాట్లాడుతూ ఈ సంవత్సరం మహిళా దినోత్సవథీమ్ ప్రకారం మహిళా పెట్టుబడితోనే సాధ్యం అవుతుందన్నారు. విరసం సభ్యురాలు వరలక్ష్మి మాట్లాడుతూ మహిళా దినోత్సవం శ్రామిక మహిళలదే అని విలాసవంతమైన మహిళలది కాదని అన్నారు. రోజుకు 15 గంటల పని నుండి అనేక పోరాటాల ద్వారా మహిళలు 8 గంటల పని విధానాన్ని, ఓటు హక్కును పురుషులతో సమానంగా వేతనాన్ని సాధించారన్నారు. ఇంటి పనుల్లో మహిళలతోపాటు పురుషులు కూడా భాగస్వామ్యం కావాలన్నారు. ఆరోగ్య సలహాదారు చంద్రకళ మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. డాక్టర్ సమిత మాట్లాడుతూ లింగవివక్ష చూపకూడదన్నారు. 'నేను.. సావిత్రిబాయిని' పుస్తకాన్ని లాయర్ హరిత పరిచయం చేస్తూ.. ఈ పుస్తకాన్ని ఓల్గా అతి సరళమైన భాషలో తెలుగులోకి అనువదించారని, దీనిని జెవివి తెలుగు వారికి పరిచయం చేయడం అభినందనీయమన్నారు. చివరిగా కార్యక్రమంలో స్వీయ రక్షణపైన తేక్వాండో ఉపాధ్యాయురాలు తస్లీమ్ విద్యార్థిని సాయిశ్రవణ్ ప్రదర్శించారు. కార్యక్రమంలో జిల్లా సమత కన్వీనర్ దేవమణి, పట్టణ ప్రధాన కార్యదర్శి సునీత, హేమలత, మీనా, కార్తిక, సరోజ, సన, మురళీగుప్త, తవ్వాసురేష్, మధుసూధన్‌రెడ్డి, పోలంకి శ్రీరాములు, ప్రకాష్, చదువులబాబు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జెవివి సభ్యులు



ఇంటింటి ప్రచారంలో పుట్టా సుధాకర్ యాదవ్

కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉంటా..

ప్రజాశక్తి - ఖాజీపేట

కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉంటానని మైదుకూరు టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. ఆదివారం బస్టాండ్, స్థానిక టీచర్స్ కాలనీలో ఆయన బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్టా టిడిపి ప్రవేశ పెట్టిన మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరస్తూ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. మైదుకూరు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గం ఇన్‌ఛార్జి మల్హోత్రా, టిడిపి మండల సీనియర్ నాయకులు సందుల నాగశివారెడ్డి, రాష్ట్ర మైనారిటీ నాయకులు ఖాదీరుల్లా, పత్తూరు ఉప సర్పంచ్ ముత్తూరు రమణ, క్లస్టర్ ఇన్‌ఛార్జి సరిటాల వీరయ్య, హరినాథ్‌రెడ్డి, పుల్లయ్య నాయుడు, జానకిరామ్ నాయుడు, కమలాపురం ఫరూక్, జలీల్ అహ్మద్, జండాల మహబూబ్ బాషా, పిచ్చి నాయుడు, ఎంపిటిసి భాస్కర్‌రెడ్డి, గంగిరెడ్డి చిన్న, ఐ టిడిపి మండల అధ్యక్షులు పాపాన మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.



మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరిస్తున్న జ్యోతి, సరస్వతమ్మ

ఎర్రగుంట్ల : బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి, సంక్షేమానికి చంద్రబాబు ష్యూరిటీ అని జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి సతీమణి జ్యోతి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని టి సుంకేసుల గ్రామంలో జ్యోతి, భూపేష్‌రెడ్డి తల్లి సరస్వతి బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వీరికి స్థానిక మహిళలు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామంలోని గడప గడపకూ తిరుగుతూ సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ, కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మోహన్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, ఓబులేసు, ఈశ్వర య్య, శ్రీనివాసులు, లోకేష్, చెన్నారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ ఆలయాభివృద్ధికి రూ.10లక్షలు విరాళం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణంలోని శ్రీకృష్ణ దేవాలయాభివృద్ధికి తనవంతగా బిసివై పార్టీ జాతీయ అధ్యక్షులు బోడే రామచంద్ర యాదవ్ రూ.10 లక్షలు విరాళం ప్రకటించారు. ఆదివారం ఆయన శ్రీకృష్ణ దేవాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రామచంద్ర యాదవ్‌కు ఆలయ కమిటీ సభ్యులు వేదమంత్రాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ ఈ దేవాలయం రాష్ట్రంలో అతిపెద్ద శ్రీకృష్ణ దేవాలయంగా చెప్పవచ్చన్నారు. భవిష్యత్తులో ఈ ఆలయం ఒక పర్యాటక దేవాలయంగా మారనుందన్నారు. పులివెందుల నియోజకవర్గంలోని వేంపల్లి పట్టణంలో బిసివై పార్టీ ఆత్మీయ సమావేశానికి వస్తున్న సందర్భంగా ఆయన శ్రీకృష్ణ ఆలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ధరణి రమణతోపాటు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామచంద్ర యాదవ్

మహిళకు రూ.10వేలు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అయ్యవారిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని తిమ్మాయిపల్లె గ్రామానికి చెందిన ఖతాల్‌గారి రిహన కూతురుకు ఇంటి దగ్గర ఇంటి గోడ పడి హర్షిత అనే 12 ఏళ్ల అమ్మాయికి కాలు విరిగింది. మెరుగైన వైద్యం కోసం తిరుపతి స్విమ్స్‌లో కాలు ఆపరేషన్ చేయించుకున్నారు. వాళ్ల కుటుంబ పరిస్థితి బాగాలేనందున మెరుగైన వైద్యం కోసం కడప జిల్లా టిడిపి అధికార ప్రతినిధి పి మునిశేఖర్‌రెడ్డి రూ.10వేల ఆర్థికసాయం చేశారు. నగదును అయ్యవారిపల్లె టిడిపి సర్పంచ్ కె రహమతుల్లా, వైస్ సర్పంచ్ నాగన్న బాధితుల ఇంటికెళ్లి బాలిక తల్లికి అందజేశారు.




బాధిత మహిళకు నగదు అందజేస్తున్న సర్పంచ్

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

ప్రజాశక్తి - మైదుకూరు

మైదుకూరు మునిసిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో ప్రజలు నివసించే ఇళ్లపై మూడు, నాలుగు అడుగుల ఎత్తులో విద్యుత్ వైర్లు ఉన్నాయని, విద్యుత్ అధికారులు పట్టించుకున్న పాపానపోలేదని రైతు నేత ఎవి రమణ పేర్కొన్నారు. ఆదివారం ఆయన ప్రమాదకరంగా ఇళ్లపై వెళుతున్న విద్యుత్ తీగలను పరిశీలించారు. ప్రమాదం జరగకముందే అధికారులు మేల్కొని విద్యుత్ తీగల నుంచి ప్రజలను కాపాడాలని ఆయన కోరారు. సమస్యను స్థానిక ప్రజలు ఆశాఖ అధికారులకు తెలిపినా నిర్లక్ష్యం వహిస్తూ సమస్యకు పరిష్కారం చూపలేదని తెలిపారు. 2008లో కాలనీ ఏర్పడినప్పటి నుండి ఇప్పటివరకు ప్రతి సంవత్సరం విద్యుత్ అధికారులకు ప్రజలు సమస్య గురించి తెలుపుతున్న అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఒక వ్యక్తి ప్రమాదపు బారిన పడి దాదాపు మూడు లక్షలు వరకు ఖర్చు అయిందన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కాలనీకి వచ్చిన మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డికి సమస్యను తెలపగా విద్యుత్ ఎఇ ఆఫీస్ కొచ్చి కలవమని చెబితే రైతు సేవా సమితి పట్టణ నాయకులు రాజా విద్యుత్ కార్యాలయానికి వెళ్లి కలిస్తే రూ.6 వేలు విద్యుత్ స్తంభం మార్పిడికి ఖర్చవుతుందని తెలిపారన్నారు. ఆ డబ్బులు కడితే స్తంభం మార్పిడి చేస్తామని అంటున్నారని తెలిపారు. రోడ్డు, డ్రయినేజీ, విద్యుత్, నీరు వంటి మౌలిక వసతుల కల్పన కోసమే ప్రజల నుండి ఇంటి పన్ను రూపంలో మునిసిపాలిటీ వసూలు చేస్తోందన్నారు. విద్యుత్ అధికారులు డబ్బులు అడగడం సబబు కాదన్నారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే రైతు సేవా సమితి ఆధ్వర్యంలో మైదుకూరు విద్యుత్ కార్యాలయాన్ని ప్రజలతో కలిసి నిర్బంధిస్తామని ఎవి రమణ హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సేవా సమితి పట్టణ నాయకులు రాజా, అహ్మద్ పాల్గొన్నారు.



గృహాల మీద వెళుతున్న విద్యుత్ తీగలను పరిశీలిస్తున్న ఎ.వి రమణ